nipuna
Every Wednesday Free Supplement
05.
28 ఆగస్టు 2024
పేజీలు 8

## ఎత్తయిన రైలు వంతెన

ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన చీనాబ్ రైల్వే వంతెనపై జూన్ 16న ఒక రైలు ఇంజిన్‌ను నడిపి తొలి ట్రయల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. కశ్మీర్‌ను దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానించేందుకు ఇప్పటికే ఉధంపూర్–బారాముల్లా రైల్వే లింక్ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. దీనిలో భాగంగానే నదీ గర్భం నుంచి 359 మీటర్ల ఎత్తులో చీనాబ్ నదిపై 1315 మీటర్ల పొడవైన వంతెనను నిర్మించారు. చైనాలోని బెయిపాన్ నదిపై నిర్మించిన 275 మీటర్ల ఎత్తైన షుబాయ్ రైల్వే వంతెన పేరుతో ఉన్న ప్రపంచ రికార్డును చీనాబ్ రైల్వే వంతెన అధిగమించింది.

# 'శిలాజ ఇంధనాల వాడకం మానేద్దాం.. మార్పు సాధిద్దాం'

గ్రూప్-1 ప్రత్యేకం
జనరల్ ఎస్సే

## పర్యావరణం



**కాప్-28 సదస్సు- 2023**

- వాతావరణ మార్పులతో సంభవించే విపత్తులు మానవ జీవనాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. అల్పాదాయ, వర్ధమాన దేశాల ప్రజలే ఎక్కువగా విపత్తుల బారినపడుతున్నారు. ఐక్యరాజ్యసమితి విపత్తుల నివారణ నివేదిక ప్రకారం గత ఐదు దశాబ్దాల్లో ప్రపంచ వ్యాప్తంగా 12 వేల ప్రకృతి విపత్తులు సంభవించాయి. వీటి వల్ల దాదాపు 20 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు రూ. 35 లక్షల కోట్ల వరకు ఆస్తి నష్టం సంభవించింది. లక్షల మంది నిరాశ్రయులయ్యారు.
- వాతావరణ మార్పుల ప్రభావం తలెత్తిన విపత్తుల కారణంగా భారతదేశంలో గత రెండు దశాబ్దాల్లో దాదాపు లక్ష మంది మరణించారు. ప్రపంచంలో ఎక్కువగా వరదల బారిన పడుతున్న దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉంది. ప్రకృతి విపత్తుల వల్ల దేశానికి ఏడాదికి సగటున రూ. 70 వేల కోట్ల ఆర్థిక నష్టం వాటిల్లుతున్నట్లు వివిధ అధ్యయనాల్లో వెల్లడయ్యింది. వాతావరణ మార్పుల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టకపోతే 2050 నాటికి భారతదేశ దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధి తొమ్మిది శాతం వరకు క్షీణిస్తుందని రిజర్వ్ బ్యాంక్ హెచ్చరించింది.
- 2030 నాటికి సంవత్సరానికి సగటున 560 విపత్తులు సంభవించి దాదాపు నాలుగు కోట్ల మంది దుర్భర పేదరికంలోకి నెట్టివేయబడతారని వాతావరణ మార్పులపై అంతర ప్రభుత్వాల కమిటీ, ఐక్యరాజ్యసమితి విపత్తుల ఉపశమన సంస్థ నివేదికలు హెచ్చరిస్తున్నాయి. వాతావరణ మార్పుల నియంత్రణలో పట్టణ ప్రభుత్వాలదే ప్రధాన పాత్ర అని ఐక్యరాజ్యసమితి నివేదిక స్పష్టం చేసింది. పారిస్ ఒప్పందం మొదలుకొని ఇప్పటి వరకు జరిగిన కాప్ సదస్సులు వాతవరణ మార్పులకు సంబంధించి అనేక తీర్మానాలు చేశాయి.
- ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో పర్యావరణ సమస్యలపై భాగస్వామ్య పక్షాల 28వ సదస్సును (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ (కాప్)-28) 2023, నవంబర్ 30 నుంచి డిసెంబర్ 12 వరకు యూఏఈలోని దుబాయ్‌లో నిర్వహించారు. ఈ సదస్సుకు 190 దేశాల నుంచి దాదాపు 60 వేల మంది ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, పర్యావరణ కార్యకర్తలు, వాణిజ్యవేత్తలు హాజరయ్యారు.
- కాప్-28 సదస్సులో మొట్టమొదటిసారి ప్రపంచ వ్యాప్త వాతావరణ పరిస్థితిపై సమీక్షించారు. గ్లోబల్ వార్మింగ్ పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్ వద్ద స్థిరీకరించాలన్న పారిస్ తీర్మానం అమలులో ఎంత వరకు ప్రగతి సాధించామనే అంశాన్ని ఈ సదస్సులో ప్రధానంగా సమీక్షించారు. గ్లోబల్ వార్మింగ్‌కు కారణమవుతున్న బొగ్గు, చమురు డిమాండ్‌ను తగ్గించడం, పునరుత్పాదక ఇంధనాల ఉత్పత్తి, ఇంధన సామర్థ్యాల పెంపుదల వంటి అంశాలపై ఈ సదస్సులో సుదీర్ఘంగా చర్చించారు. థర్మల్ విద్యుత్ కేంద్రాలపై జరిగిన చర్చలో అమెరికా ఇకపై బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను నిర్మించబోమని స్పష్టం చేయడం కీలక పరిణామం.
- 2030 నాటికి కర్బన ఉద్గారాలను ప్రస్తుతం ఉన్న స్థాయి నుంచి 43 శాతం వరకు తగ్గించడంపై కాప్-28 సదస్సులో ప్రధానంగా చర్చించారు. వాతావరణ మార్పులను నియంత్రించడంలో సంపన్న దేశాల నుంచి మరిన్న స్పష్టమైన హామీలు ఉండాలని సదస్సులో దేశం కోరింది.
- భారతదేశం, చైనాతో సహా అనేక దేశాల నుంచి దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై, వాటి తయారీ ప్రక్రియలో వెలువడే కాలుష్యం స్థాయిని బట్టి కర్బన సుంకం విధించాలన్న యూరోపియన్ యూనియన్ ప్రణాళికపై కాప్-28 సదస్సులో సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. సాధారణంగా ఇనుము, ఉక్కు, సిమెంట్, ఎరువులు, అల్యూమినియం వంటి ఉత్పత్తుల తయారీకి అధిక ఇంధనం అవసరం. అయితే యూరోపియన్ యూనియన్ దేశాలు పర్యావరణ ప్రమాణాలకు అనుగుణంగా వీటిని ఉత్పత్తి చేస్తున్నప్పటికీ ఇతర దేశాలు మాత్రం కాలుష్య స్థాయిలను పరిగణనలోకి తీసుకోవడం లేదని యూరోపియన్ యూనియన్ వాదించింది. ఈ నేపథ్యంలో యూరోపియన్ యూనియన్‌యేతర దేశాల నుంచి అలాంటి ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటే వారి తయారీ ప్రక్రియలో వెలువడే కాలుష్య ఉద్గారాల స్థాయిని బట్టి 'కార్బన్ అడ్జస్ట్‌మెంట్ మెకానిజం' పేరుతో కర్బన సుంకం వసూలు చేయాలని యూరోపియన్ యూనియన్ ప్రతిపాదించింది. అయితే దేశంతో సహా ఇతర వర్ధమాన, పేద దేశాలు కర్బన సుంకాన్ని వ్యతిరేకించాయి.
- చారిత్రాత్మక శిలాజ ఇంధన ఒప్పందంతో కాప్-28 సదస్సు ముగిసింది. గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారానికి, తద్వారా భూతాపానికి, భూగోళంపై ప్రకృతి విపత్తులకు, జీవుల మనుగడకు పెను సవాలుగా మారుతున్న శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించాలని భావించి 'శిలాజ ఇంధనాల వాడకం మానేద్దాం.. మార్పు సాధిద్దాం' అనే నినాదాన్ని ఈ సదస్సులో ప్రకటించారు.
- శిలాజ ఇంధనాల వాడకానికి వ్యతిరేకంగా ఈ సదస్సు ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని సభ్యదేశాల ప్రతినిధులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. 2050 నాటికి నెట్ జీరో (సున్నా) ఉద్గారత లక్ష్యంగా ఒప్పందంలో 8 సూత్రాల ప్రణాళికను ప్రవేశ పెట్టారు.

1) పారిస్ సదస్సు తీర్మానించిన ప్రకారం భూతాపం పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయడానికి కర్బన ఉద్గారాలను వేగంగా, స్థిరంగా, విస్తృతంగా తగ్గించాలని దుబాయ్ ప్రకటన పిలుపునిచ్చింది.
2) వాతావరణ మార్పుల వల్ల నష్టపోయే పేద దేశాలకు ఆర్థిక సహాయం అందించడం కోసం ఒక ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయడానికి ఆమోదం లభించింది.
3) 2030 కంటే ముందే గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాన్ని నియంత్రించడానికి పర్యావరణ అనుకూల ఇంధన వనరుల వాడకాన్ని గణనీయంగా పెంచుకోవాలి.
4) క్లైమేట్ యాక్షన్ కోసం సంపన్న దేశాల నుంచి విధులను సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలకు బదిలీ చేయాలన్న ప్రతిపాదనపై చర్చలు జరిగాయి.
5) జీవవైవిధ్యానికి, మానవాళికి ఎలాంటి హాని కలగకుండా వాతావరణ మార్పుల నియంత్రణకు కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలని నిర్దేశించారు.
6) ప్రస్తుతం అమల్లో ఉన్న పారిస్ ఒప్పందం లక్ష్యాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అనుగుణంగా శిలాజ ఇంధనాల వినియోగం, ఉత్పత్తిని తగ్గించుకోవాలని తీర్మానించారు.
7) పర్యావరణ పరిరక్షణ కోసం గ్రీన్ క్లైమేట్ ఫండ్ తరహాలో క్లైమేట్ ఫైనాన్స్, సపోర్టింగ్ ఫండ్ ఏర్పాటు చేయాలన్న అంశానికి మద్దతు లభించింది.
8) కాప్-26 సదస్సు ఫలితాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత కర్బన ఉద్గారాల సమాచారాన్ని నమోదు చేసే విషయంలో నిబంధనలను సవరించారు. అన్ని దేశాల, అన్ని వర్గాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని శిలాజ ఇంధనాల నుంచి పర్యావరణ అనుకూల ఇంధనాల వైపు క్రమంగా మారాలని తీర్మానించారు.

- అమెరికా, కెనడా, కెన్యాతో సహా 63 దేశాలు ప్రపంచంలో మొట్టమొదటిసారి గ్లోబల్ కూలింగ్ ప్రతిజ్ఞపై సంతకం చేయడం కీలకమైన అంశం. దీనిలో భాగంగా 2050 నాటికి శీతలీకరణ ఉద్గారాలను కనీసం 68 శాతం తగ్గించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ప్రస్తుతం ఈ కూలింగ్ ఉద్గారాలు గ్రీన్‌హౌస్ వాయువుల్లో 7 శాతం వరకు ఉన్నాయి. ఇవి 2050 నాటికి మూడు రెట్లు పెరుగుతాయని భావించి వీటిని నియంత్రించడానికి పటిష్ట కార్యాచరణను రూపొందించారు.
- వాతావరణ మార్పుల ప్రభావం నుంచి భూగోళాన్ని రక్షించుకునే లక్ష్యంతో నిర్వహించిన కాప్-28 సదస్సులో భారతదేశంలో ప్రస్తుతమున్న ఉద్గారాల తీవ్రతను 2030 నాటికి 45 శాతం తగ్గించడం, శిలాజయేతర ఇంధనం వాటాను 50 శాతానికి పెంచాలని వాతావరణ మార్పులను ఎదుర్కొనే పేద, వర్ధమాన దేశాలకు అభివృద్ధి చెందిన, సంపన్న దేశాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేయాలనే అంశాలను భారత ప్రధాని ప్రతిపాదించారు. 2028లో జరిగే కాప్-33 సదస్సును భారతదేశంలో నిర్వహించేందుకు సభ్యదేశాలు అంగీకరించాయి.

**నూతనకంటి వెంకట్**
పోటీ పరీక్షల నిపుణులు
ఆర్గనైజింగ్ సెక్రటరీ
గ్రూప్-1 అధికారుల సంఘం
9849186827



3వ పేజీ తరువాయి

**ఫుట్‌బాల్**

- 1956లో ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు చేతిలో క్వార్టర్స్‌లో ఓడిపోయి పతకాన్ని చేజార్చుకుంది.

**పీటీ ఉష**

- 1984లో లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌లో పీటీ ఉష 400 మీ. హర్డిల్స్‌లో తృటిలో కాంస్యం కోల్పోయి నాలుగో స్థానంలో నిలిచింది.

**మిల్కా సింగ్**

- 1960 ఒలింపిక్స్‌లో 400 మీ. పరుగులో తృటిలో పతకం కోల్పోయాడు.

**మహిళల హాకీ**

- 1980లో మహిళల హాకీలో ఆతిథ్య సోవియట్ యూనియన్ జట్టు చేతిలో ఓడి పతకాన్ని చేజార్చుకుంది.

**లియాండర్ పేస్, మహేశ్ భూపతి**

- 2004 ఏథెన్స్‌లో అనులిచ్ లుబిసిచ్ జోడి చేతిలో లియాండర్ పేస్–మహేశ్ భూపతి జోడి పరాజయం పొంది నాలుగో స్థానంలో నిలిచింది.

**జాయ్‌దీప్ కర్మాకర్**

- 2012 లండన్ ఒలింపిక్స్‌లో జాయ్‌దీప్ కర్మాకర్ 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ విభాగంలో కాంస్యం గెలిచిన షూటర్ కంటే 1.9 పాయింట్లు వెనుకబడి నాలుగో స్థానంలో నిలిచాడు.

**అభినవ్ బింద్రా**

- 2008 ఒలింపిక్స్‌లో స్వర్ణంతో చరిత్ర సృష్టించిన అభినవ్ బింద్రా 2016లో 10 మీ. ఎయిర్ రైఫిల్‌లో స్వల్ప తేడాతో పతకం చేజారింది.

**సానియా, బోపన్న**

- 2016లో జరిగిన ఒలింపిక్స్‌లో సానియా–బోపన్న జోడీకి మిక్స్‌డ్ డబుల్స్‌లో పతకం చేజారింది.

**దీపాంకర్**

- జిమ్నాస్ట్ దీపాంకర్ 2016లో నాలుగో స్థానంలో నిలిచింది.

**మహిళల హాకీ**

- 2020 టోక్యో ఒలింపిక్స్‌లో అర్జెంటీనా జట్టు చేతిలో ఓడిన భారత మహిళల హాకీ జట్టు నాలుగో స్థానంలో నిలిచింది.

**దీపక్ పునియా**

- 2020 టోక్యోలో జరిగిన ఒలింపిక్స్‌లో కాంస్యం కోల్పోయాడు.
- ఒలింపిక్స్‌లో 206 దేశాలు పాల్గొనగా 84 దేశాలు ఏదో ఒక పతకం సాధించాయి.
- 62 దేశాలు స్వర్ణాలు సాధిస్తే, 74 దేశాలు రజతాలు సాధించాయి.

**భారతీయ క్రీడాకారులు**

- భారత్ నుంచి పారిస్ ఒలింపిక్స్‌కు 117 మంది అథ్లెట్లు వెళ్లారు. ఇందులో 47 మంది మహిళలు, 70 మంది పురుషులు.

**పతకాల పట్టిక (పారిస్-2024)**

| ర్యాంకు | దేశం | స్వర్ణం | రజతం | కాంస్యం | మొత్తం |
|---|---|---|---|---|---|
| 1) | అమెరికా | 40 | 44 | 22 | 126 |
| 2) | చైనా | 40 | 27 | 24 | 91 |
| 3) | జపాన్ | 20 | 12 | 13 | 45 |
| 4) | ఆస్ట్రేలియా | 18 | 19 | 16 | 53 |
| 5) | ఫ్రాన్స్ | 16 | 26 | 22 | 64 |
| 6) | నెదర్లాండ్స్ | 15 | 7 | 12 | 34 |
| 7) | బ్రిటన్ | 14 | 22 | 29 | 65 |
| 8) | దక్షిణ కొరియా | 13 | 9 | 10 | 32 |
| 9) | ఇటలీ | 12 | 13 | 15 | 40 |
| 10) | జర్మనీ | 12 | 13 | 8 | 33 |
| 71) | భారత్ | 0 | 1 | 5 | 6 |



మిగతా 6 పేజీలో